నమస్తే తెలంగాణ
కామారెడ్డి
3 | నిజామాబాద్, శనివారం 17 ఫిబ్రవరి 2024 | KAMAREDDY

మీనం @ 21 కిలోలు

నిజాంసాగర్ ప్రాజెక్టులో భారీ చేప లభ్యమైంది. మండలంలోని హసన్‌పల్లి గ్రామానికి చెందిన మత్స్యకార్మికుడు గూల లక్ష్మణ్ శుక్రవారం సాయంత్రం చేపల వేటకు వెళ్లగా వలకు భారీ చేప చిక్కింది. చేప బరువు 21 కిలోలు ఉన్నదని లక్ష్మణ్ సంతోషంతో తెలిపాడు.
–నిజాంసాగర్, ఫిబ్రవరి 16

పరామర్శ

ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.
–కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 16

కామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు,కార్మిక సంఘాల ప్రతినిధులు, నాయకులు

రైతు,కార్మికుల కన్నెర్ర

కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళనలు
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు
పాల్గొన్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

కామారెడ్డి, ఫిబ్రవరి 16: రైతు, కార్మికులు కన్నెర్ర చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, రైతు, కార్మిక విధానాలను నిరసిస్తూ ఉమ్మడి జిల్లాలో శుక్రవారం కార్మిక సంఘాలు చేపట్టిన 'గ్రామీణ భారత్ బంద్' విజయవంతమైంది. ఇందులో భాగంగా వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కొత్త బస్టాండ్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకొని మూడు గంటలపాటు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి రైతులందరికీ ఒకేసారి రుణమాఫీ చేయాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీ పని 200 రోజులకు పెంచి, రోజుకు ఎనిమిది వందల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైల్వే, రక్షణ, విద్యుత్, బ్యాంకులు, ఎల్ఐసీ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యావసర వస్తువులపై జీఎస్టీని రద్దు చేయాలన్నారు. ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించాలన్నారు.అనంతరం అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌కు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దశరథ్, బాలరాజు, రాజు, రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశ్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు

ఆటో బంద్ సక్సెస్

ఉమ్మడి జిల్లాలో నిలిచిన వాహనాలు
కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో
ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల డిమాండ్

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 15: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆటో డ్రైవర్లు చేపట్టిన బంద్ ఉమ్మడి జిల్లాలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రాస్తారోకోలు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ఆటో మోటర్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్లు ఉపాధిని కోల్పోయారని అన్నారు. ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకొని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫాల్, పట్టణ అధ్యక్షుడు సాయిలు, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ జాఫర్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా పది,ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఫిబ్రవరి 16: ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ నెల 28 నుంచి మార్చి 16వ తేదీ వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఇంటర్ థియరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఫస్టియర్‌లో 9,993 మంది, సెకండియర్‌లో 9,516 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. ఇందుకోసం జిల్లాలో 37 సెంటర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. 55 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, సహాయ సూపరింటెండెంట్లు, శాఖ అధికారులతోపాటు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 3 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పదోతరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 11,962 మంది విద్యార్థులు హాజరుకానుండగా, ఇందుకోసం 62 కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. సెంటర్లను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి పరీక్షలు సాఫీగా నిర్వహించేందుకు 660 మంది ఇన్విజిలేటర్లు, 64 మంది రూట్ అధికారులు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లతోపాటు మూడు ఫ్లైయింగ్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పరీక్షల సమయంలో 144 సెక్షన్, సీసీ కెమెరాల నిఘాతోపాటు విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం, డీఈవో రాజు, డీసీఆర్‌బీ డీఎస్పీ మదన్‌లాల్, పరీక్షల సహాయ కమిషనర్ నీలం లింగం, ట్రెజరీ అధికారి సాయిబాబా, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర, తపాలా, విద్యుత్, వైద్యారోగ్య శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇదేం బరితెగింపు?

ఫ్లెక్సీ వివాదంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి
పోలీస్ స్టేషన్‌లోనే చేయి చేసుకున్న కాంగ్రెస్ నాయకులు
ఇద్దరి రిమాండ్.. బెయిల్‌పై విడుదల

భిక్కనూరు ఠాణా ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భిక్కనూరు, ఫిబ్రవరి 16: ఓ ఫ్లెక్సీ వివాదంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లోనే చేయిచేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలో చోటుచేసుకున్నది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. షబ్బీర్ అలీ జన్మదినం సందర్భంగా బస్వాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన ఓ ఫ్లెక్సీని బుధవారం ఎవరో చింపేశారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలపై గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో యువకులను ఎస్సై సాయికుమార్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరించారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తుడం జీవన్ ఆగ్రహంతో యువకులపై చేయిచేసుకున్నారు. ఈ విషయం బయటికి తెలియడంతో యువకుల కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేసి, పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటికే భీంరెడ్డి, తుడం జీవన్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్ చేయగా, బెయిల్‌పై విడుదలయ్యారు.

రౌడీ షీట్ ఓపెన్ చేయాలి..

ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ కార్యకర్తలపై పోలీస్‌స్టేషన్‌లోనే జులుం ప్రదర్శించిన కాంగ్రెస్ నాయకులపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ పదేండ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ తాము ఏనాడూ ఇతరులపై దౌర్జన్యాలకు పాల్పడలేదన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్, ఫిబ్రవరి 16: వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశించారు. జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చే శారు. తాగునీటి ఎద్దడి తలెత్తే గ్రామాలను గుర్తించి ఇప్పటినుంచే ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. జుక్కల్ నియోజకవర్గానికి ప్రతిరోజూ అవసరమయ్యే నీరు, సింగూరు నుంచి సరఫరా అవుతున్న జలాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఒక్క గ్రామంలో ఇబ్బంది తలెత్తినా అధికారులదే బాధ్య త అని అన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ రాజేంద్రకుమార్, ఇంట్రా ఈఈ రమేశ్, గ్రిడ్ ఈఈ స్వప్న, డీఈఈలు అరవింద్, శ్రీకాంత్, కౌశిక్, ఏఈలు నయీం, గణేశ్, రాచ ప్ప, రవళిక, సుమలత, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఎకరాలకు సాగునీరివ్వండి..

అసెంబ్లీలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 16: వెనుకబడిన ఎల్లారెడ్డి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తండాలు ఎక్కువగా ఉన్నాయని, ఇక్కడి ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ప్యాకేజీ-22 ద్వారా నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని నీటిపారుదల శాఖ మంత్రిని కోరారు. చాలా మంది పేదలకు ఇండ్లు మంజూరుకాలేదని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సరైన నివాసం లేక పాములు, తేళ్లతో సావాసం చేయాల్సి వస్తోందని, కొందరు పాముకాటుతో చని పోతున్నారని గుర్తు చేశారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో గైనిక్, అనస్థీషియా డాక్టర్లు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.

శివనామ స్మరణతో మార్మోగిన ఇందూరు
తరలివచ్చిన అశేష భక్తజనం

ఉమ్మడి జిల్లాలో శుక్రవారం రథ సప్తమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు కొనసాగగా..సాయంత్రం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథం ముందు భక్తుల కోలాటాలు, భజనలు, కీర్తనలు ఆకట్టుకున్నాయి. వేదమంత్రాలు, నృత్యాల నడుమ నీలకంఠేశ్వరస్వామి పార్వతీ సమేతంగా రథంపై ఊరేగారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పలు పార్టీల నాయకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.
–సుభాష్‌నగర్, ఫిబ్రవరి 16